ఎమ్మెల్యే వివేక్‌కు మాజీ ఎమ్మెల్యే స్వాగతం

నవతెలంగాణ-జైపూర్



అమెరికా పర్యటన ముగించుకుని మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఘనంగా స్వాగతం పలికారు. అమెరికా నుంచి హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో వివేక్ వెంకటస్వామిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ఓదెలు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓదెలుతో పాటు నాయకులు దుర్గం నరేష్, రఘునాథ్ రెడ్డి, గుడ్ల రమేష్, పైడిమల్ల నర్సింగ్, రావికంటి వెంకటేష్ ఉన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

సీఐటీయూలో పలువురి చేరిక

నవతెలంగాణ-ఖానాపూర్



పెంబి మండల రాముగూడ అంగన్‌వాడీ టీచర్, ఆయా మంగళవారం ఖానాపూర్ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు చేరారు. పెంబి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్, తెలంగాణ సంఘం నుంచి సీఐటీయూ చేరిన వీరిని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ కండువా కప్పి ఆహ్వానించారు. అంగన్‌వాడీ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ సంఘంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అంగన్‌వాడీ కార్యకర్త రాణి తెలిపారు. ఆయాల సమస్యలు పరిష్కరించిన ఘనత సీఐటీయూ సంఘానికి ఉందని అన్నారు. ఇందులో అంగన్‌వాడీ ఆయా ఆత్రం హేత్మబాయి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో మంగళవారం టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని అన్నారు. రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదులు ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల సరిపడ విత్తనాలు మండల కేంద్రం, గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. విత్తనాలు తీసుకునేటప్పుడు, అధీకృత విత్తన దుకాణంలో మాత్రమే విత్తనాలు తీసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు, విత్తన రకం, లాట్ నెంబర్, గడువు తేది, సంతకం, ధర మొదలైన వివరాలతో కూడిన రశీదు తప్పని సరిగా తీసుకోవాలి అన్నారు. ఈ తనిఖీల్లో ఏఓ భాస్కర్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ నాగోవరావ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే నకిలీ విత్తనాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడు లేనివిధంగా నకిలీ విత్తనాల తయారు ముఠాలు ఏర్పడటం అనేది కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు విషయంలో అన్నదాతలు ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుండే మహిళలు కూడ వంద మీటర్ల దూరంలో లైన్ కట్టడం అనేది అత్యంత బాధాకరమన్నారు. నేడు జిల్లా కేంద్రంలో అన్నదాతల పట్ల జరిగిన ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. రైతులకి అవసరమైన డిమాండ్ కలిగిన రాశీ 659 రకం పత్తి విత్తనాలు జిల్లాకు సరిపడా తెప్పించడంలో జిల్లా యంత్రాగంతో పాటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఘోరంగా విఫలమయ్యారని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు తయారీ చేస్తూ, పట్టుబడిన ముఠా పైన పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్త : ఏఈఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని మన్మథ్ వ్యవసాయ విస్తరణ అధికారి ఉమేష్ సూచించారు. శనివారం మండలంలోని మన్మథ్ గ్రామ రైతులకు ఖరీఫ్ సీజన్ పట్ల అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు పొందాలని సూచించారు.

మహిళలకు వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం హెల్త్ వెల్నెస్ సెంటర్ కరంజి, అర్లి పరిధిలోని శాంతినగర్, గిరిగాం, గ్రామాలలో కిషోర బాలికలకు, ఆడవారికి నెలసరి బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ నిఖిల్‌రాజ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా శుభ్రమైన నాప్కిన్స్ వాడకం, వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం గూర్చి తద్వార వ్యాధులు రాకుండా ఉంటుందని అన్నారు. అసంక్రమిత వ్యాధుల, ఓపీ సేవల రికార్డులు పరిశీలించడం జరిగిందని కరంజి పరిధిలోని కొజ్జనూగూడ గ్రామాన్ని సందర్శించి, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషకాహార ప్రాధాన్యత గూర్చి వివరించారు. సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సురక్షిత కాన్పుల కోసం మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భీంపూర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలు ఆర్ఎంపీ వైద్యుల దగ్గర పరీక్షలు గానీ ఇంజెక్షన్లు వేయించు కోవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు బి.గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ జి.సంధ్యారాణి, ఎ.సాహితి, మాయావతి, ఆరోగ్య కార్యకర్తలు ఎస్.సరస్వతి, డి.సుజాత, గోదావరి, నిఫీజ, భాగ్యవతి, ఆశా కార్యకర్తలు సాజీద, అనుసూయ, జయమాల పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కైలాస్ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది అనంతరం ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మిషన్ భగీరథ.. లీకేజీల పర్వం..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మేజర్ గ్రామపంచాయతీ ఇంద్రవెల్లి పరిధిలోని హీరాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు పర్వంగా మారిందని కోఆప్షన్ సభ్యులు జిలానీ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా పైప్‌లైన్ లీకేజి కావడంతో నల్లా నీళ్ల వృధాగా పోతోంది. సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ముందే ఎండాకాలం గుక్కెడు నీళ్ల కోసం తహ తహ లాడుతున్న రోజులివి, మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల రెండు రోజులుగా వృధాగా నీళ్ల పోతున్నా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖా అధికారులు దీనిపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెలిగిన హైమస్ట్ లైట్లు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తర్నం గ్రామంలో సరైన వీధిదీపాలు లేకపోవడంతో గ్రామస్తులు రాత్రి అయ్యిందంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మంగళవారం తర్నం గ్రామంలో వీధిదీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో వీధి దీపాలు, రెండు హైమాస్ లైట్ వచ్చాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సమీపిస్తున్న గడువు.. మొదలైన గుబులు..!

- లోక్‌సభ కౌంటింగ్‌కు మరో వారమే గడువు
- ప్రధాన పార్టీలు.. అభ్యర్థుల్లో ఎడతెగని ఉత్కంఠ
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికార యంత్రాంగం

ఎన్నికల సమరం ముగిసింది. ఇక కౌంటింగ్ మాత్రమే మిగిలింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. గడువు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు..అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. అభ్యర్థులే కాకుండా ఆయా పార్టీలకు చెందిన శ్రేణుల్లోనూ ఆతృత నెలకొంది. ఈ నెల 13న ఓటింగ్ ప్రక్రియ ముగియడం.. కౌంటింగ్‌కు దాదాపు 20రోజుల సమయం ఉండటంతో ఇన్ని రోజులు అందరూ ప్రశాంతంగా ఉన్నారు. ఓటింగ్ ముగిసిన వెంటనే లెక్కలు వేసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాను వ్యక్తం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. నియోజకవర్గాలు.. సామాజిక వర్గాల వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో కూడా ముందుగానే అంచనా వేసుకున్నారు. ఈ క్రమంలో ఎవరికి వారు గెలుస్తామని ధీమాగా చెబుతుండగా..లెక్కింపులో ఎవరిది పై చేయిగా నిలుస్తుందోనని జనాల్లోనూ ఆసక్తికరంగా మారింది. మరోపక్క లెక్కింపు కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మరో వారం రోజుల్లోనే అభ్యర్థుల భవితవ్యం వెల్లడికానుంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల లెక్కింపునకు సమయం ఆసన్నమవుతోంది. ఎన్నికల సమరంలో నువ్వా-నేనా అనే రీతిలో హోరాహోరీగా పోరాడిన ప్రధాన పార్టీలు..అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. జూన్ 4న ఉదయం లెక్కింపు ప్రారంభం కాగా అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడికానున్న దృష్ట్యా అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత లెక్కలు వేసుకున్న అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో 16.50లక్షల మంది ఓటర్లు ఉండగా..12.21ఓట్లు పోలయ్యాయి. 74.03శాతం పోలింగ్ నమోదైంది. ఈ 12.21లక్షల మంది ఓటర్లలో అత్యధికంగా ఎవరి వైపు మొగ్గుచూపారోనే ఉత్కంఠ నెలకొంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఎవరికి వారు లెక్కలు వేసుకున్నారు. సామాజికవర్గాలు..కులాల వారీగా ఎవరు ఎటువైపు మొగ్గుచూపారు..ఎవరికి మద్దతిచ్చారో ముందుగానే అంచనా వేశారు. మరోపక్క ఆయా నియోజకవర్గాల వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి..ఎవరు మెజార్టీ సాధిస్తారు అనే దానిపై తీవ్రస్థాయిలో చర్చించి ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. జనాల్లోనూ అభ్యర్థుల గెలుపోటములపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. అభ్యర్థులు లెక్కింపునకు ఇంకా సుమారు 20రోజుల గడువు ఉండటంతో ప్రశాంతంగా ఉంటున్నారు. గెలుపుపై పైకి గంభీరంగా ఉంటున్నా.. లెక్కింపు తేదీ సమీపిస్తున్న కొద్దీ లోలోన ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కౌంటింగ్‌కు మరో వారమే గడువు ఉండటంతో ప్రధాన పార్టీలు, అభ్యర్థుల్లో రోజురోజుకు ఉత్కంఠ తారాస్థాయికి చేరుతోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా కౌంటింగ్ ప్రక్రియపైనే చర్చ సాగుతోంది.

అధికార యంత్రాంగం నిమగ్నం..!

లోక్‌సభ ఫలితాలపై అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొనగా.. అధికారుల్లో హడావుడి కనిపిస్తోంది. ఆదిలాబాద్ లోక్‌సభ కౌంటింగ్‌ను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుండటం..ఇందుకు మూడు కేంద్రాలను ఏర్పాటుచేయడంతో కౌంటింగ్ అధికారులు, సిబ్బంది నియామకం పూర్తిచేశారు. నిరంతరం ఈవీఎంల భద్రతను పర్యవేక్షిస్తున్న అధికారులు కౌంటింగ్ కోసం ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తిచేసి లెక్కింపుపై అనుసరించాల్సిన పద్ధతులను వివరిస్తూ శిక్షణ ఇచ్చారు. ఎన్నికల పరిశీలకులు, సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, సూక్ష్మ పరిశీలకుల నియామకాన్ని పూర్తిచేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలను పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్



నవతెలంగాణ-తలమడుగు

మానవాళి సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు సోషలిజమే పరిష్కార మార్గమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులకు రెండు రోజుల పాటు జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముందుగా పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పెట్టుబడి దారి విధానాలతో మానవ సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామజిక, మానవ శ్రమ దోపిడీ పద్ధతుల నుంచి బయట పడాలంటే మానవ సమాజానికి సోషలిజమే పరిష్కార మార్గమని ఆయన అన్నారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పెట్టుబడి దారి విధానాల వల్ల నిరుద్యోగం, ఆకలి కేకలు, ప్రజల మధ్య ఎలాంటి ఆర్థిక, సామజిక శ్రమ దోపిడీ చేస్తున్నాయో తెలుసుకొని, ఆ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలని చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. దేశంలో ధనిక, పేద అంతరాలు తొలగాలన్న, సమాజంలో శ్రామికుల జీవితంలో వెలుగులు రావాలన్న శ్రామిక వర్గ సోషలిజం వస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు ఎర్ర తివాచి పరుస్తూ, శ్రామికుల సంపదను కార్పొరేట్ పెట్టుబడి దారులకు దాసోహం చేస్తుందని అన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి..

కృత్రిమ విత్తన కొరతను సృష్టించి వ్యాపారస్తులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. నకిలీ విత్తనాలు ఒకవైపు, కృత్రిమ కొరత మరోవైపు రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్‌కు తగినట్టుగా విత్తనాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, సోమేశ్, గంగన్న, నాయకులు లింగాల చిన్నాన్న, విష్ణు, కొట్నాక్ సక్కు, మడవి నాగోరావ్, కనక మల్కు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భోరజ్ చెక్‌పోస్ట్‌లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

- రవాణాశాఖాధికారులను విచారించి వివరాల సేకరణ..
- రికార్డులు, నగదు లావాదేవీల పరిశీలన



నవతెలంగాణ-జైనథ్

జైనథ్ మండలం బోరజ్ చెకోపోస్టులో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్టీఓ చెక్ పోస్టుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరిపారు. ఇందులో భాగంగానే బోరజ్ చెక్ పోస్టులో అధికారులు సోదాలు చేశారు. పలువురు డ్రైవర్లను విచారించడంతో పాటు రికార్డులు, నగదు లావాదేవిలను పరిశీలించారు. ఏసీబీ కరీంనగర్ రేంజ్ ఇన్స్‌పెక్టర్ తిరుపతి చెక్‌పోస్టులో విధుల్లో ఉన్న ఎంవీఐ యశ్వంత్ కుమార్, ఏఎంవీఐ అపర్ణలను పలు ప్రశ్నలను అడిగారు. రికార్డులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. వాహనాల రాకపోకల సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలోనే ఏసీబీ ఆకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. ఈ విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు ఏసీబీ కరీంనగర్ ఇన్స్‌పెక్టర్ తిరుపతి తెలిపారు. చెక్ పోస్టును తనిఖీ చేసి అధికారుల నుంచి వివరాలను సేకరించామని, విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.



వారసంత ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో వారానికి రెండు రోజులు జరిగే వారసంత ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం కమిషనర్ మనోహర్‌గౌడ్ మున్సిపల్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో ఆదివారం, బుధవారం జరగబోయే వారసంతను పాత అంగడి బజార్ మార్కెట్‌లో ఏర్పాటు చేయించామని అన్నారు. చిరు వ్యాపారులు కూరగాయ వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ సహకరించి పాత అంగడి బజార్ మార్కెట్‌లో కూరగాయలు విక్రయించుకోవాలని కోరారు. ప్రధాన రహదారి రోడ్లకు ఇరువైపులా అమ్ముతున్న కూరగాయల దుకాణాలను తొలగించి పాత మార్కెట్లోకి మళ్లించడంలో వాహనదారులకు, ప్రభుత్వాస్పత్రికి వచ్చే అంబులెన్స్‌కు దారి సులభమైందని మున్సిపాలిటీ సిబ్బంది కేటాయించిన బాక్సులలో వారే కూర్చొని కూరగాయలు విక్రయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు ఏఈ తిరుపతి, మనాల శంకర్, ఫిరోజ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



నవతెలంగాణ-జన్నారం

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు 101వ జయంతిని మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీ రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వారి అభివృద్ధికి తోడ్పాటును అందించిన మహా నాయకుడు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుల విజయ్, నవీన్ కాసిఫ్, నరసయ్య పాల్గొన్నారు.

నస్పూర్ : శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలో టీడీపీ నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ 101వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు తలారి రాజు, కుంచె భూపతి, గరినేని రాజయ్య మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో 1983లో టీడీపీ పార్టీ స్థాపించి త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పేదవారికి సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల పెన్నిధిగా పేరుగాంచాడని కొనియాడారు. అనంతరం కమ్మ వారి సంక్షేమ సేవా అధ్యక్షుడు మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల సుధాకర్, అభిమానులు జక్కుల రాజేశం, సురేందర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలి

- ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్
- ఆగ్రో డీలర్లతో ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువుల అందించాలని, విత్తన కొరత లేకుండా చూడాలని ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని మార్వాడీ ధర్మశాలలో బోథ్, ఆదిలాబాద్ ఆగ్రో డీలర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళన సమావేశానికి ఇరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఆగ్రో డీలర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీలర్స్ మాట్లాడుతూ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు నకిలీ ఎరువులు సరఫరా చేసే వారిపై చట్టరీత్య కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. వ్యాపారస్తులు కూడా రైతులకు విత్తనాలు అమ్మెటపుడు రశీదులు స్పష్టంగా రాసి ఇవ్వాలని సూచించారు. రైతులు కూడా లైసెన్స్ కలిగిన షాపులలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. ఏదైతే డైమండ్ ఉన్న సీడ్స్ మార్కెట్లో దొరకడం లేదో వాటి గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేలా చేస్తామన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సీడ్స్ రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మనమందరం కలిసి రైతు బాగు కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షకు 550 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు 2,207 మంది విద్యార్థులు హజరు కావాల్సి ఉండగా 1694 మంది విద్యార్థులు హాజరయ్యారు. 513 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం పరీక్షకు 845 మంది విద్యార్థులు హజరు కావాల్సి ఉండగా, 808 మంది విద్యార్థులు హాజరయ్యారు. 37 మంది గైర్హాజరైనట్టు ఇంటర్ బోర్డు అధికారి రవీందర్ కుమార్ తెలిపారు.

స్నానానికి వెళ్లి నీటిలో మునిగి యువకుడి మృతి

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టు మరమ్మతుల పనుల నిమిత్తం వచ్చిన భైంసా మండలం మాజ్రీ గ్రామానికి చెందిన శివాజీ మాధవ్(23) మంగళవారం ప్రాజెక్టులో స్నానం చేయడానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో మాధవ్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

నకిలీ ఎరువుల పట్టివేత

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అనుమతి లేని ఎరువులు అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో మంగళవారం మండల వ్యవసాయ రవీందర్, ఎస్సై ప్రదీప్ కుమార్‌తో కలిసి లారీ నెంబర్ టీఎస్ 07 యూఈ 2673 వాహనంలో అనుమతి లేని 750 ఎరువుల సంచులు వాటి విలువ రూ.5లక్షల 55 వేల విలువ గల సంచులని స్వాధీనం చేసుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

డెయిరీఫాంతోనే ఆర్థికాభివృద్ధి

నవతెలంగాణ-ఇచ్చోడ

డెయిరీఫాంతోనే పశు యజమానులు ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని డెయిరీఫాంలను మండల పశు వైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్‌తో కలిసి పలు డెయిరీఫాంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డెయిరీ రైతులతో మాట్లాడుతూ పాడి పశువులకు వర్షాకాలం ప్రారంభంలో సరైన టీకాలు వేయించి, వ్యాధి బారిన పడకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పాల దిగుబడి కూడా



తగ్గినట్టు అనుమానం కలుగుతే పశు వైద్యులకు చూపించాలని అన్నారు. వేసవిలో పాడి పశువులకు నీరు ఎక్కువగా అందిస్తూ, ఆకుపచ్చ పశుగ్రాసాన్ని అందించడంతో పాల దిగుబడి తగ్గకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ రైతులు అభిషేక్, శివ, పశు వైద్య సిబ్బంది శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

మండల టాపర్లకు డీఈఓ అభినందనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు భవిష్యత్‌లో ఇలాగే మరెన్నో ఉత్తమమైన ఫలితాలు సాధించాలని, డీఈఓ ప్రణీత సూచించారు. మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని గిరిజన శిక్షణ కేంద్రంలో ఏకలవ్య ఫౌండేషన్ విద్యా వాహిని ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన 35 మంది విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసి అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ వైస్ చైర్మెన్ పరియాల్, ట్రస్టీ దిగంబర్, సీఈఓ మధుకర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తేనెటీగల పెంపకంతో మంచి ఆదాయం



నవతెలంగాణ-ఉట్నూర్

తేనెటీగల పెంపకంతో స్వచ్ఛమైన తేనె లభించడంతో పాటు రైతుల పంట దిగుబడులు గణనీయమైన వృద్ధి చెంది, మంచి ఆదాయం పొందడానికి అవకాశం ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఆసక్తి గల కల్గిన గిరిజన యువతి యువకులు, రైతులు ఈ శిక్షణ కార్యక్రమానికి తమ పేర్లు ఐటీడీఏ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్ కుమార్‌కు సూచించారు.

విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పలు విత్తన దుకాణాల్లో పోలీసు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం విత్తన నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. అనుమతి లేని విత్తనాలను నిల్వ చేసి, అమ్మడం చేయవద్దని డీలర్లకు సూచించారు. రైతులకు విత్తనాలు అమ్మేటపుడు ఖచ్చితంగా రశీదులు ఇవ్వాలని తెలిపారు. దుకాణాల్లో ఉన్న విత్తనాల వివరాలను స్టాక్ బోర్డులో కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. విత్తనాలు తీసుకున్న రైతుల వివరాలు ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

రైతులపై లాఠీచార్జి జరగలేదు : జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో రైతులపై పోలీసులు ఎటువంటి లాఠీ చార్జ్ జరపలేదని, రైతుల తోపులాట జరగకుండా క్రమబద్ధీకరించడం కోసం పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ గౌస్ ఆలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పత్తి విత్తనాల కొనుగోలు కోసం దుకాణాల వద్దకు వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకున్నారని, చదర గొట్టారన్నది అవాస్తవమని తెలిపారు. రైతుల బాగు కోసం ఎటువంటి అపాయం జరగకుండా, వారి క్షేమం కోసం సదుద్దేశంతో రైతులందరినీ ఒక క్రమబద్ధీకరణతో వరుస క్రమంలో ఏర్పాటు చేయడం కోసం పోలీసు సిబ్బంది బందోబస్తు విధులను నిర్వర్తిస్తుంటారని గ్రహించాలని పేర్కొన్నారు. ఎటువంటి ఆందోళనకర పరిస్థితులు ఆదిలాబాద్‌లో ఏర్పడలేదని, రైతులతో తీవ్ర వాగ్వాదం, తోపులాట అనేది జరగలేదన్నారు. పోలీసులు ఏ రైతుపై కూడా లాఠీచార్జ్ చేయడం అనేది జరగలేదని గమనించాలని, ఇలాంటి ఆందోళనకర అవాస్తవమైన, వార్తలను ప్రచురించి, ప్రశాంతమైన రైతులకు ఇబ్బందికర పరిస్థితిని తీసుకురాకూడదని పేర్కొన్నారు. అవస్తవమైన వార్తలను, ట్రోలింగ్‌లను ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వారణాసిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రామారావు పటేల్

నవతెలంగాణ-భైంసా

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోటీ చేస్తున్న వారణాసిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎన్నికల కమిటీ చైర్మెన్ ఈటెల రాజేందర్‌తో కలిసి ఆయన వారణాసి వెళ్లారు. అక్కడ తెలుగు వాళ్ళ దగ్గరికి వెళ్లి ప్రధాని మోడీ నాయకత్వాన్ని బలపరచాలని, బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈరోజు నుంచి మరో రెండు రోజుల వరకు అక్కడే ఉంటూ ఎమ్మెల్యే పటేల్ ప్రచార పర్వంలో పాల్గొంటారు.

రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తక్షణమే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కులగణనను ప్రభుత్వం చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డా.ఉప్పు కృష్ణంరాజు, అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కుటుంబాల వారికి రిజర్వేషన్లు ద్వారా చాలా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుగా 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీహార్ తరహాలో తెలంగాణ అసెంబ్లీలో బీసీలకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూన్ 4న ఉదయం 8గంటల నుంచి పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్, ఈవీఏంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని దీనికి వేరువేరుగా టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సిబ్బంది శిక్షణలో కలెక్టర్ పాల్గొని, పలు అంశాలపై అవగాహన కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి సిబ్బందికి ట్రైనర్ లక్ష్మణ్ ద్వారా శిక్షణను ఇప్పించారు. ఈ శిక్షణలో ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరో వారం రోజులు మాత్రమే ఎన్నికల ఓట్ల లెక్కింపు క్యా సంబంధించి ఎన్నికల ఫలితాల సమయం ఉందని అన్నారు. అసెంబ్లీ స్థానాల వారిగా పోలైన ఓట్లు, మొత్తం పోలింగ్ బూత్‌ల ఆధారంగా లెక్కింపు టేబుళ్లను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంబించి, మొత్తం పూర్తి స్థాయి ఫలితాల వెల్లడికి మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం పట్టనుందని వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల పరిశీలకులు, సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్స్, వీరితో పాటు వివిధ పార్టీల ఎన్నికల ఏజెంట్లు ఉంటారని తెలిపారు. ఈ క్రమంలో ఓట్ల లెక్కింపు రోజు విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణలో పూర్తి అవగాహన కల్పించుకోవాలని, తెలియని విషయాలు తెలుసుకోవాలని అన్నారు. ఈ శిక్షణలో సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

- జిల్లా విద్యా శాఖాధికారిణి ప్రణీత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుర్తించడం అభినందనీయమని డీఈఓ ప్రణీత అన్నారు. మంగళవారం ఆమె ఏకలవ్య ఫౌండేషన్ హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఇంద్రవెల్లి హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు 9.7 గ్రేడ్‌లు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు, వారి పోషకులను ఏకలవ్య ఫౌండేషన్ తరపున సన్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ ఫౌండేషన్ ఏజెన్సీలోని మారుమూల గిరిజన పల్లెల్లో విద్యను బలోపేతం చేయడం, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గుర్తించడం వల్ల వారిలో పైచదువులకు ప్రోత్సహించడం చాలా గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో సైతం ప్రయివేటుకు ధీటుగా వెలుస్తున్నాయన్నారు.



ఏకలవ్య ఫౌండేషన్ వైస్ చైర్మెన్ మీర్ కుమార్ పరియాల్ మాట్లాడుతూ విద్యార్థులు హై స్కూల్ స్థాయి నుంచి కష్టంగా కాకుండా ఇష్టంగా చదువాలన్నారు. ఉన్నత చదువులు చదివి పోషకులకు, గురువులకు మంచి పేరు తెచ్చుకావాలని ఆకాంక్షించారు. పదిలో ప్రతిభ కనబరిచిన జిల్లా నుంచి మొత్తం 35 మందిని ఎంపిక చేసి సన్మానంతో పాటు ప్రశంస పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ మధుకర్, డా.కైలాస్, ఏస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రమేష్, వినోద్, ప్రతినిధులు దిగాంబర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ కంటే ముందే రైతులకు అవస్థలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖరీఫ్ సీజన్ సన్నద్ధం కంటే ముందే అన్నదాతలకు విత్తనాల కొనుగోలు కష్టాలు మొదలయ్యాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విత్తనాల షాపులను సందర్శించారు. ఆయా షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేస్తున్న అన్నదాతలతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్యతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే అన్ని శాఖల సమన్వయంతో రాష్ట్రంలో ఏ విత్తనాలకు డిమాండ్ అయితే ఉందో వాటి కొరత లేకుండా చూడాలని ముందుగానే సూచించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యను తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిసాన్ మోర్చా అధ్యక్షుడు దయాకర్, ఆదినాథ్, అశోక్‌రెడ్డి,



ముకుందరావు, వెంకన్న మహేష్, భూమన్న ఉన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేద వారికి ఎం కావాలో తెలుసుకోని వారికి అందించిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుదేనని టీడీపీ నాయకులు అల్లూరి రాజారెడ్డి అన్నారు. మంగళవారం దివంగత నాయకుడు ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు అల్లూరి రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలను ఆదుకునేలా ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించేలా ఆ సమయంలో సైకిళ్లను పంపిణీ చేసిన ఘనత ఉందన్నారు. సమూల మార్పులకు శ్రీకారం చూట్టి ప్రజలకు సుపరిపాలన అందించిన ఆయన సేవలను ఎన్నటికి మరవలేనివన్నారు. అదే విధంగా పార్టీ స్థాపించి 40 వసంతలు పూర్తి చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల రాము, ఓమన్న, తోకల లస్మన్న, ఆరె రాజన్న, గంగారెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

చేతిపంపుల మరమ్మతులు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఉట్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సేవాదాస్ నగర్‌లో గత కొన్ని రోజులుగా బోరింగ్ పని చేయకపోయడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాజేష్ జాదవ్ వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి బోరింగ్‌ను మరమ్మతులు చేసి తాగునీటి సమస్య పరిష్కారం చేశారు.



జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏట రాజశేఖర్‌రెడ్డి రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏట మాట్లాడుతూ వరి పంట దిగుబడి జీలుగ ఎరువుగా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆలూరు, కౌట్ల(బి), సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయి. 30 కిలోల బస్తా రూ. 2,790 గాను సబ్సిడీపై రూ. 1,116 లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మల్లేష్ సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



దివంగత ఎన్టీఆర్‌కు ఘన నివాళ్లు

- మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు 101వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘం కార్యాలయంలో పార్టీలకు అతీతంగా మంగళవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. అటు నటుడిగా, ఇటు రాజకీయ నాయకుడిగా ప్రత్యేకత చాటుకున్న ఎన్టీఆర్ మరణించి, కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ తెలుగువారి గుండెల్లో నిలిచే ఉన్నారని అన్నారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి వేడుకలను తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలుగువారి ఆత్మగౌరవానికి, ప్రజాహిత పాలనకు ప్రతీక దివంగత నందమూరి తారకరామారావు అని, రెండు రూపాయలకే కిలో బియ్యాన్ని అందజేసి, పేదవారి గుండెల్లో చోటు సంపాదించుకున్న మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలుకు మే31 చివరి తేది

నవతెలంగాణ-నిర్మల్

జొన్నల కొనుగోలుకు చివరి తేదీ మే31 అని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొమ్మిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ మద్దతు ధర రూ.3,180తో ఇప్పటివరకు 7,473 మెట్రిక్ టన్నుల జొన్నలను 3,359 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకారం దాదాపు అన్నీ గ్రామాలు పూర్తి కావడం జరిగిందని వెల్లడించారు. మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయం నుంచి అందిన ఆదేశానుసారముగా జొన్నల కొనుగోలును మే31 వరకు జిల్లా మొత్తంలో అన్నీ జొన్న కొనుగోలు కేంద్రాలను మూసివేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లాలోని జొన్నలు అమ్మని రైతులు తమకు సంబంధించిన మార్కెట్ యార్డ్‌లో తమ జొన్న పంట తేమ 14 శాతం ఉండే విధంగా ఆరబెట్టి, చెత్త చెదారము లేకుండా శుభ్రపర్చి జోన్న కొనుగోలు చివరి తేదీలోపల అమ్మి మద్దతు ధర రూ. 3180 క్వింటాలకి పొందాలని కోరారు.

31న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ. 50 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అండర్-8, 10, 12, 14, 16, 18, 20 విభాగంలో బాల బాలికలకు, స్త్రీ, పురుషులకు వేరువేరుగా పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయస్సు ధృవీకరణ, బోనాఫైడ్, ఆధార్ ధృవీకరణ పత్రాలతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెలా 6, 7 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492136510 నెంబరును సంప్రదించాలని సూచించారు.

సిరాల శివారులో చిరుత పులి సంచారం

నవతెలంగాణ-భైంసా

మండలంలోని సిరాల గ్రామశివారులో చిరుతపులి సంచరించడంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన దేరే మాధవ్ అనే మహాదేవుని గుట్ట సమీపంలో గుహ వద్ద పులిని చూడటంతో భయంతో ఊళ్లోకి వచ్చి గ్రామస్తులకు తెలియజేశాడు. గత రెండు సంవత్సరాల క్రితం ఇదే ప్రాంతంలో పులి సంచరించింది. దీంతో పొలాలకు పని కోసం వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ ఉపాధి అవకాశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగులైన యువకులకు కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వే, జనరల్ వర్క్ సూపర్ వైజర్, వెల్డింగ్, ఎలక్ట్రిషియన్, పైప్ ఫిటర్, ప్లంబింగ్, పెయింటింగ్, డెకరేషన్ కోర్సులలో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తు యూనిఫాం, స్టేషనరీ, శిక్షణ సామాగ్రి ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌తో పాటు వివిధ కంపెనీలలో ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కొరకు విద్యార్హత సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము, నివాస ధృవీకరణ పత్రము, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో జిల్లా కేంద్రంలోని న్యాక్ కార్యాలయంలో జూన్ 2లోగా సమర్పించాలని పేర్కొన్నారు. శిక్షణ కేంద్రం అడ్వాన్స్ స్కిల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ బెల్లంపల్లిలో ఉంటుందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9154548063, 8328507232 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఇచ్చోడ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు నందమూరి తారకరామారావు 101వ జయంతి సందర్భంగా మండలంలోని ఆడేగామ(కె) గ్రామంలో టీడీపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు పోతారెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు, అమలు చేసినా ఘనత ఆయనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మన్న, దాసరి నర్సింహులు, శ్రీను, కార్తీక్, అడెల్లు, లస్మన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

పాము కాటుతో ఎద్దు మృతి

నవతెలంగాణ-జైనూర్



పాము కాటుతో ఎద్దు మృతి చెందిన ఘటన లింగాపూర్ మండలంలోని కీమానాయక్ తండా గ్రామంలో జరిగింది. బాధితుడు గిరిజన రైతు ఆడే రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీగా ఇంట్లోనే ఎద్దును రాత్రిపూట కట్టి ఉంచారు. ఉదయం లేచి చూసేసరికి ఎద్దు మరణించి ఉంది. అర్ధరాత్రి సమయంలో పాము కుట్టి మృతి చెంది ఉంటుందని తెలిపారు. దీనిని గత సంవత్సరం రూ.45వేలకు కొనుగోళు చేశానని తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఎద్దు మరణించడం కష్టంగా ఉందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆర్ఎస్‌పీ

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని నాగులవాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నీలయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు ఖాజా మొయినోద్దీన్, లెండుగురే శ్యాం రావు, అస్లం, లెండుగురే శ్యామ్ రావు, రాంప్రసాద్, నవీన్ ఉన్నారు.

అనాథ పిల్లలకు నిత్యావసర సరకులు పంపిణీ



నవతెలంగాణ-కౌటాల

తల్లిదండ్రులను కొల్పోయిన ముగ్గురు గిరిజన పిల్లలకు బాలల సంరక్షణ అధికారి బి.మహేష్ పరామర్శించారు. నవతెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా అధికారులు మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎ. భాస్కర్ ఆదేశాల మేరకు పిల్లకు నిత్యావసర సరకులను అందించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లల యోగ క్షేమాలను బాలల సంరక్షణ అధికారి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలుగా మారిన మాడవి అజిత్ కుమార్, మాడవి విజయ్ కుమార్, మాడవి శివ కుమార్‌లను ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేధిస్తామని తెలిపారు. అదేవిధంగా అర్హులైన ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి ప్రతి నెల రూ.4 వేల చొప్పున స్పాన్సర్‌షిప్ పథకం కింద అందిస్తామన్నారు. చదువుకునేందుకు ఇద్దరు బాలలను గురుకుల పాఠశాలలో ప్రవేశం కలిపిస్తామని తెలిపారు. రెండు నెలలున్న బాబు శివకుమార్‌ను ప్రభుత్వానికి అప్పగిస్తే ఆదిలాబాద్‌లోని శిశుగృహానికి తరలించి న్యాయ బద్ధంగా దత్తత ఇస్తామన్నారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం లీగల్ అధికారి యం. శ్రీనివాస్, సోషల్ వర్కర్స్ డోంగ్రీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

- టీజీబీ రీజినల్ మేనేజర్ ప్రభుదాస్



నవతెలంగాణ-జైనూర్

కుటుంబ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ బీమా పాలసీ చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మాణిక్‌గూడా పంచాయతీకి చెందిన ఆత్రం గుణవంతురావ్ బ్యాంకులో ఇన్సూరెన్స్ పాలసీ కట్టి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబానికి రూ.20 లక్షలు మంజూరు కాగా మంగళవారం కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో ఆత్రం గున్వంత్ రావు బ్యాంకు ద్వారా ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారన్నారు. ప్రమాదవశత్తు మరణించడంతో కుటుంబానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోతే ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉంటుందని ప్రతి కుటుంబ పెద్దతో పాటు కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ పాలసీలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాజేష్, మణిగూడ మాజీ సర్పంచ్ పూసం రాము, నాయకులు ఉయిక చందన్ షావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై సమీక్ష

నవతెలంగాణ-రెబ్బెన

జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయ కాన్ఫరెన్సు హాల్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై ఆయా విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. పదవ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 2న ఎజెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. దీని కోసం సీఈఆర్ క్లబ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్ రావు, పీఓ ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎస్ఈ(సివిల్) భాషా, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ తరగతులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తేనెటీగల పెంపకం ద్వారా రైతులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందవచ్చునని దీనికోసం ఆసక్తి గల యువతకు తేనెటీగల పెంపకం కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ పరిధిలో గల గిరిజన యువతీ, యువకులు, రైతుల కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా తేనెటీగల పెంపకంపై ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను ఐటీడీఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9848687871, 8897622042, 9032313933 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. శిక్షణలో పాల్గొనే వారికి తేనెటీగల పెంపకంలోని మెలకువలతో పాటు మార్కెటింగ్ అంశాలను బోధిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామంలో మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని ఏఈ ఇమ్రాన్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నంబాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు జూన్ 12లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఈ నెల 30లోగా ప్రారంభించి, జూన్ 12లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు 282, కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శపాఠశాలలు 18 స్కూళ్లలో తాగునీరు, టాయిలెట్లు, పాఠశాల గదుల మరమ్మతులు, విద్యుద్దీకరణ పనులు సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. పనులను ప్రధానోపాధ్యాయులు, ఎస్సీఆర్పీలు, ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు గ్రామ సమైక్య సంఘం సభ్యులతో సమన్వయం చేసుకుని ప్రతిరోజు పాఠశాలలను సందర్శించి పనుల పురోగతిపై ప్రతిరోజు నివేదికలు సమర్పించాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించవద్దని, వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ చూడాలన్నారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సీఆర్పీలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన విత్తనాలు కొనాలి





నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన పత్తి విత్తనాలను మాత్రమే వినియోగించుకోవాలని, దళారులను నమ్మి నకిలీ విత్తనాలను కొనుక్కొని మోసపోవద్దని ఏఓ మధులత అన్నారు. మంగళవారం మండలంలోని భూపాలపట్నం, పారిగాం గ్రామంలో పత్తి, ఇతర పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని ఫెర్టిలైజర్ షాపును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మధులత మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లేని కంపెనీలు తమ స్వలాభం కోసం రైతులకు నాణ్యత లేని పత్తితో పాటు ఇతర విత్తనాలను విక్రయిస్తున్నారన్నారు. నకిలీ విత్తనాలను అమ్మడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వారి మోసపూరిత మాటలు నమ్మవద్దని ఎలాంటి సందేహాలున్న సంబంధిత గ్రామాల్లో ఉండే ఏఈఓలను సంప్రదించాలన్నారు. వ్యవసాయ శాఖ గుర్తించిన ఫెర్టిలైజర్ దుకాణంలో మాత్రమే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువగా దిగుబడి వచ్చే పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. ఆమె వెంట ఏఈఓలు శ్రీనివాస్, శోభారాణి ఉన్నారు.

కౌటాల : విత్తనాలు కొనుగోలుపై రైతులకు ఏఈఓ దుర్గాభవాని అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాలు గుర్తింపు, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉంటు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు తీసుకోవాలన్నారు. వరి పంట వేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పంటలు వేయడం వల్ల నేల సారం పెరిగి దిగుబడులు పెరుగుతాయని సూచించారు. సొసైటీలో అందుబాటులో ఉన్న జీలుగు విత్తనాలు తీసుకోవాలన్నారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా రూ.1116 ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువుల దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని కొండపల్లి, గ్రామంలో నకిలీ విత్తనాలపై ఏడీఏ రాజులనాయుడు, ఏఈఓ శ్రీవిద్య రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అనుమతులున్న ఎరువుల దుకాణాల వద్ద కొనుగోలు చేసి రసీదులు తీసుకోవాలన్నారు. ఎవరైన లూజ్ విత్తనాలు అమ్మితే వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. విత్తనాలు కొన్నప్పుడు బిల్లు తప్పని సరిగ్గా తీసుకోవాలని, ఆ పంట కాలం అయిపోయే వరకు బిల్లును భద్రంగా ఉంచుకోవాలన్నారు. బిల్‌లో లాట్ నంబర్, వెరైటీ పేరు, ఎక్స్‌పైరీ వంటి విషయాలు ఉన్నావా లేవా అన్నది తీసుకున్న ప్యాకెట్‌తో సరిపోల్చుకోవాలని సూచించారు. హెచ్‌డీపీఎస్ పత్తి పంట గురించి రైతులకు తెలియజేశారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని డబ్బా, ఆడేపల్లి గ్రామంలో రైతులకు విత్తన కొనుగోలు పై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచులలో లూస్‌గా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈనెల చివరి వరకు ధాన్యం మొత్తం సేకరించి రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అదే విధంగా మండలంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్లను పరీక్ష నిమిత్తం రాజేంద్రనగర్ ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది సందేహాలున్న వ్యవసాయక అధికారులకు వెంటనే తెలపాలన్నారు. ఆయనతో పాటు ఏఈఓలు శ్రీనివాస్, శ్రీలత, హెప్సిబా ఉన్నారు.

బెజ్జూర్ : మండలంలోని ఔత్సరంగపల్లి, సలుగుపల్లి, ఆర్కగూడ గ్రామాల్లో నకిలీ విత్తనాలపై మంగళవారం ఏఈఓ రవితేజ అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగిన దుకణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైన లూజ్ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయశాఖ వారికి తెలిజేయజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.





కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 4న జరిగే లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఓట్ల లెక్కింపుకు హాజరయ్యే ఇబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యాక్రమానికి సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి పాల్గొన్నారు. కౌంటింగ్ రోజు నిర్వహించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటు విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. అనధికార వ్యక్తులకు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉందని, ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డు ధరించాలని చెప్పారు. సిర్పూరు నియోజకవర్గానికి 14 టేబుళ్లు, 23 రౌండ్లు, ఆసిఫాబాద్ 16 టేబుళ్లు, 23 రౌండ్లు ఉంటాయన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు మూడవ ర్యాండమైజేషన్ అనంతరం ఏ టేబుల్‌కు కేటాయించబడుతారో ఆ టేబుల్ వద్ద విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. మొదటి మూడు రౌండ్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ టేబుల్ వద్దకు వచ్చే కంట్రోల్ యూనిట్ తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానిదో లేదో సరిచూసుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏవైనా సందేహాలుంటే సహాయ ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ట్రైనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ గణన చేపట్టాలి

నవతెలంగాణ-రెబ్బెన

బీసీ గణన చేపట్టాలని బీసీ సంఘాల ఐక్యత కుల సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్టంలో జనాభాలో 52శాతం బీసీ కులాలు జనాభా ఉందని తెలిపారు. దాని ప్రతిపాదికన గ్రామపంచాయతీలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కలిపించాలన్నారు. జనాభాలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలక్షన్‌లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కలిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు కడతాల మల్లయ్య, కుమ్మరి సంఘం అధ్యక్షులు కుమ్మరి మల్లేష్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు తోట లక్ష్మణ్, మేరా సంఘం రాష్ట్ర నాయకులు అక్కేవార్ దయాకర్, మైనార్టీ మండలం నాయకులు ఆసిఫ్ అలీ, నాయిని బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేగండ్ల కిష్టయ్య, ముదిరాజ్ జిల్లా యూత్ నాయకులు శ్రీనివాస్, మేదరి సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు గట్టు తిరుపతి, జిల్లా పద్మశాలి యూత్ నాయకులు పరికిపాండ్ల సతీష్ పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి



నవతెలంగాణ-రెబ్బెన

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు పడుతున్నారని, సొంత భవనం నిర్మించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ)జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని, గతంలో రాళ్లపేట గ్రామంలో ఎడెకరాల భూమి కేటాయించినప్పటికీ భవనానికి సంబంధించి నిధులు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులులు గతంలో ఉన్న బీసీ హాస్టల్‌లో 800 మంది విద్యార్థినులకు సరిపడ గదులు లేక ఒకే గదిలో 40-50 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శ్రావణి, మండల సహాయ కార్యదర్శి చాపిడి తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఆర్కెగుడా గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ఇటీవల బైక్ ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కుమారుడు ఆత్రం సాయుధ కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, వినోద్, మేడి సతీష్ పాల్గొన్నారు.

వ్యాయమంతో ఆరోగ్యం

- సింగరేణి బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్



నవతెలంగాణ-రెబ్బెన

నిత్యం వ్యాయమంతో ఆరోగ్యంగా ఉంటారని, అందుకే సంస్థ కూడా జిమ్‌లను ఏర్పాటు చేసిందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ అన్నారు. మంగళవారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో గల సింగరేణి జిమ్, స్విమ్మింగ్ పూల్‌ను గోలేటి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతితో కలిసి సందర్శించారు. వ్యాయమానికి సంబంధించిన పరికరాల గురించి జీఎం రవి ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ఉద్యోగులతో పాటు వారి పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిమ్, స్విమ్మింగ్ పూల్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక్కడి వసతులను చూసి జీఎం సానుకూలంగా స్పందించారు. ఎన్నికల కారణంగా సీఈఆర్ క్లబ్‌లో బీఎస్ఎఫ్ జవాన్లు ఉండడంవల్ల స్విమ్మింగ్ పూల్ పూర్తి స్థాయిలో తెరవలేదన్నారు. ఇప్పటినుండి స్విమ్మింగ్ పూల్ అందుబాటులో ఉంటుందని కార్మికులు, వారి పిల్లలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం నరేందర్, బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ హెచ్ఓడీ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కే.కిరణ్ బాబు, ఖైరగూడ ఫిట్ సెక్రెటరీ మారం శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి రావు, క్రీడాకారులు సాగర్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు అభివృద్ధి నివేదికలు తీసుకొని ఉదయం 11 గంటలకు మండల కార్యాలయానికి రావాలని సూచించారు.

వేసవి సెలవులలో పిల్లల పుస్తక పఠనం

నవతెలంగాణ-రెబ్బెన

వేసవి సెలవుల్లో పిల్లల పుస్తక పఠనం ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి ఎం.వెంకటేశ్వర స్వామి అన్నారు. రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను 20 గ్రామాలలో నిర్వహించారని ఎంఈఓ తెలిపారు. ఉదయం 7 నుండి 10 గంటల వరకు పాఠశాల ఆవరణ, కమ్యూనిటి పరిసరాలలో పిల్లలకు పఠన కృత్యాలు నిర్వహించడం అభినదంనీయమన్నారు. అదే విధంగా నంబాల కాంప్లెక్స్ సీఆర్పీ రాజేశ్ జక్కులపల్లి పాఠశాలలో పాల్గొని కప్ప తారల కోరిక అనే కథ, తక్కళ్ళపల్లి కాంప్లెక్స్ సీఆర్పీ వి.సత్యనారాయణ గోలేటి కాలనీ పాఠశాలలో మేజోళ్ల అనే కథ, రెబ్బెన కాంప్లెక్స్ సీఆర్పీ దేవేందర్ నక్కలగూడ పాఠశాలలో పెంపుడు జంతువులు అనే కథ, నవేగామ్ కాంప్లెక్స్ సీఆర్పీ మహేశ్వర్ నెర్పల్లి పాఠశాలలో తొక్క తీయాలా వద్దా అనే కథలను పిల్లలకు పఠన కృత్యం రూపంలో వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

పాఠశాలలకు యూనిఫాంలు అందజేసిన డీఆర్డీఓ

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం డీఆర్డీఓ కిషన్ యూనిఫాం లు అందజేశారు. గుడిపేట్ మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రంకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు కుట్టుడడం పూర్తయిన నేపథ్యంలో ఆయా పాఠశాలల హెడ్మాస్టర్‌లకు యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంతఈఓ పోచన్న, ఏపీఎం రాజన్న, మహిళా శక్తి సంఘం మహిళలు పాల్గొన్నారు.

చెత్తను రోడ్లపై పడేయొద్దు : ఎంపీఈఓ రమేష్

నవతెలంగాణ-జన్నారం



జన్నారంలోని వ్యాపారులు చెత్తను రోడ్లపై పడ వేయవద్దని మండల ఎంపీఈఓ, గ్రామ ప్రత్యేక అధికారి సింగిడి రమేశ్ సూచించారు. మంగళవారం పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. పట్టణంలో సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వ్యాపారస్తులు తప్పకుండా చెత్త కుండీలను ఉపయోగించాలన్నారు. ఇష్ట రీతిగా రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అలాగే వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఈఓ రాహుల్, సిబ్బంది ఉన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ సెమ్స్ ఒలింపియాడ్ 2024లో తవక్కల్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రామకృష్ణాపూర్ బ్రాంచ్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థిని జె.అంబికా, 4వ తరగతి జె.సాత్విక్ వర్మ ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారు. అలాగే మంచిర్యాల బ్రాంచ్ 7వ తరగతి చదువుతున్న మాలీహ అంజూమ్, మందమర్రి బ్రాంచ్ 3వ తరగతి చదువుతున్న పి.హర్షిత్ ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా మొదటి ర్యాంకులు సాధించినదుకు మంగళవారం విద్యార్థులను వారి తల్లిదండ్రులను పట్టణంలోని స్థానిక పాఠశాలలో తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఘనంగా సన్మానించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నేషనల్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జులై నెలలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు అవార్డ్, గోల్డ్ మెడల్ ప్రశంసా పత్రం అందిస్తారని తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుండి తవక్కల్ విద్యా సంస్థల అన్నింటిలో ఐఐటీ సిలబస్ మొదలుపెడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోనూర్, కనికలాపూర్, వరిపేట గ్రామాల్లో మంగళవారం రైతులు విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రతలు, త్తలతో పాటు నకిలీ విత్తనాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిని దేవులపల్లి వందన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును తప్పకుండా తీసుకోవాలని, లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన పాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసే తేదీని చూసుకోవాలని వివరించారు. గ్రామాలల్లో తక్కువ ధరకు గాని ఎక్కువ ధరకు అమ్మే వారి వివరాలను వ్యవసాయాధికారులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు అంజలి, రమ్య, రైతులు పాల్గొన్నారు.


సింగరేణి సామాజిక సేవలో ముందుంటుంది : జీఎం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ ఉత్పత్తితో పాటు సామాజిక సేవలు కూడా ముందుంటుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-8 డిస్పెన్సరీలో నిర్వహించిన ఎస్ఆర్పీ-1, ఎస్ఆర్పీ-3 గ్రూప్ ఆధ్వర్యంలో 66 మంది కార్మికులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై, రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్త దానం గొప్పదని, సింగరేణి సంస్థ యువ కిరణాలతో కళకళలాడుతోందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ వారికి కృతజ్ఞత అభినందనలు తెలిపారు. రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియా, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, ఏరియా సెక్రటరీ మారేపల్లి సారయ్య, ఆర్కే-8 డిస్పెన్సరీ ఫిట్ సెక్రెటరీ విజయ, కామెర వేణు, తొట్ల మల్లేష్ పాల్గొన్నారు.

సమస్యలపై ఏరియా జీఎం సానుకూలం

నవతెలంగాణ-మందమర్రి



ఏరియాలో నెలకొన్న సమస్యలపై మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సానుకూలంగా స్పందించినట్లు ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ తెలిపారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై జీఎంను కలిశారు. సింగరేణి హై స్కూల్ మైదానంలో వాకింగ్ ట్రాక్ డ్యామేజ్ అవ్వడం వలన వాకర్స్‌కి ఇబ్బందిగా ఉందని తెలపడంతో తక్షణమే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీఈఆర్ క్లబ్బు స్విమ్మింగ్ పూల్‌లో వాటర్ ఫిల్టరైజేషన్ లేకపోవడంతో స్విమ్మింగ్ చేసే వారికి దురద వస్తుందని చెప్పగా ఫిల్టరైజేషన్ చేసి సౌకర్యాలు మెరుగు పరుస్తామని జీఎం అన్నారు. భూ గర్భ గనులలో బొగ్గు ఉత్పత్తి చేసే ఎస్‌డీఎల్ యంత్రాలు పాతవి కావడంతో ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని చెప్పడంతో కొత్త యంత్రాలను తెప్పిస్తామని అన్నారు. కాసిపేట-2 గనిలో మ్యాన్ రైడింగ్ లేకపోవడం వలన కార్మికులు ఇబ్బంది పడుతున్నారని నాయకులు తెలిపారు. సమస్యలన్నీ పరిష్కరిస్తానన్న జనరల్ మేనేజర్‌కు సింగరేణి కాలరీజ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, డిజీఎం ఐడి రాజన్న, ఏఐటీయూసీ నాయకులు తిరుపతి గౌడ్, దినేష్ పాల్గొన్నారు.

నకిలీలతో జాగ్రత్త

మార్కెట్‌లో కొందరు మాయగాళ్లు ఉంటారు. వారి స్వలాభం కోసం ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తుంటారు. ఎదుటి వారు నష్టపోయినా పర్వాలేదు..మనకు మాత్రం లాభం రావాలనే దురుద్దేశంతో ఉంటారు. కొందరు నకిలీ విత్తన అమ్మకం దారులు ఇదే కోవకు చెందుతారు. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు తీసుకొచ్చి అమాయక రైతులకు అంటగడుతూ అక్రమార్జనకు పొందుతుంటారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో భారీగా నకిలీ విత్తనాలు పట్టుబడుతుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. అందుకు అన్నదాతలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా.. వ్యవసాయ అధికారులు, ఇతర నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవడమే కాకుండా.. కొనుగోలు చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

- ఖరీఫ్ సాగుకు సిద్ధం అవుతున్న రైతన్నలు
- విత్తనాల కొనుగోళ్లలో అవగాహన అవసరం
- ఏటా కొందరు బడా వ్యాపారుల దందా



నవతెలంగాణ-మంచిర్యాల

ఆరుగాలం శ్రమించి పండించిన పంట కు ఫలితం దక్కాలంటే రైతులు పంట మొదటి నుండే అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. దుక్కి దున్నింది మొదలు పంట చేతికి వచ్చే వరకు సాగుకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు పాటించాలి . ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లలో అత్యంత జాగ్రత్తలు అవసరం.. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులు ,మందులు కొనాలి .కొనుగోలు చేసిన వాటికి రశీదు , ఒరిజినల్ బిల్లు లు తీసుకోవాలి. బస్తా పై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తి ధారుణి వివరాలు ఉండాలి . రైతు తప్పని సరిగ బస్తాను తూకం వేయించి తీసుకోవాలి . కొనుగోలు చేసిన ఎరువులపై ఎటువంటి అనుమానం కలిగిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. ప్రభుత్వం గుర్తించిన బిటి 2 విత్తనాలనే రైతులు వాడాలని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

జోరుగా సాగుతున్న నకిలీ విత్తనాల దందా

జిల్లాలో కొంత కాలంగా హెచ్‌డి కాటన్ విత్తనాల సరఫరా జోరుగా సాగుతుంది. దీనితో విత్తన సాగులో కలుపు నియంత్రణకు ఉపయోగించే గ్లైఫొసేట్ గడ్డి నివారణ మందు వినియోగం పెరిగిపోయింది.దీనివల్ల పర్యావరణం, భూసారం దెబ్బ తినడం తో పాటు రైతుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వాలు నకిలీ విత్తనాలను నిషేధించినప్పటికీ హెచ్ డి కాటన్ రైతులకు చేరకుండా అడ్డుకట్ట పడడం లేదు . గ్రామాల్లో పలుకు బడి కలిగిన నాయకులూ ఈ విత్తన సరఫరాకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన వారిని అదుపులోకి తీసుకొని వారిపై పీడీ యాక్ట్‌లు పెట్టినప్పటికీ ఈ దందా ఆగుతలేదు. పట్టుపడిన వారిపై కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారన్న వాదనలు జిల్లాలో ఉన్నాయి. జిల్లాకు నకిలీ విత్తనాలు ఎక్కడి నుండి వస్తున్నాయి. పెద్ద మొత్తంలో ఎవరు వాటిని సరఫరా చేస్తున్నారు. వాటి వెనుకాల ఉన్నది ఎవరనే దానిపై పూర్తి విచారణ జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల చేతుల మీదుగానే ఈ నకిలీ విత్తనాల దందా కొనసాగుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతుంది. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో నిషేధిత విత్తనాలు పట్టుబడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయినప్పటికీ నకిలీ విత్తనాల సరఫరా జిల్లాలో ఇటు టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులకు సవాల్ విసురుతుంది. వానాకాలం సీజన్ ప్రారంభంలో అధికంగా తాండూర్, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి ,నెన్నెల నిషేధిత విత్తనాల వినియోగం ఎక్కువ కొనసాగుతుంది .సీజన్ కు ముందు నుండే నకిలీ లను రైతులకు చేర వేస్తున్నారు దళారులు . గ్లైఫొసేట్ గడ్డి మందు ను కూడా ఈ ప్రాంతాల్లో ఎక్కువ ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల నుండి తక్కువ ధరకు విత్తనాలను తీసుకొచ్చి దానికి రెట్టింపు ధరకు రైతులకు అమ్మి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

ఎల్తూరి సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి

నకిలీ విత్తనాలపై ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నాం. గ్రామాలు, పట్టణాల్లో పెద్ద మొత్తం లో పంటలు సాగు చేస్తున్న వారి వద్దకు వెళ్లి మాట్లాడి , మండలాల వారీగా అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. నకిలీ విత్తనాల పై అవగాహన కల్పిస్తున్నాం. నకిలీ విత్తనాల సరఫరాకు సంబంధించి జిల్లా లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయి. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- 5.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు, రూ.1,80,000 నగదు స్వాధీనం



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను నివారించడంలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ బృందాలతో పాటు స్థానిక పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చెన్నూర్ సమీపంలో గల బతుకమ్మ వాగు వంతెన వద్ద నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌తో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారం మేరకు చెన్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కమీషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సంజయ్, ఎస్సై లచ్చన్న, సిబ్బంది బతుకమ్మ వాగు వద్ద బీటీ-3 నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ఐచర్ వ్యాన్ నెంబర్ టీఎస్ 19టీ 3447 ఆపి తనిఖీ చేయగా ఉల్లిగడ్డ బస్తాల కింద నకిలీ పత్తి విత్తనాలు గుర్తించినట్లు తెలిపారు. కర్ణాటక నుండి మహారాష్ట్ర మీదుగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి మీదుగా అక్రమంగా తరలిస్తుండగా గుంటూరుకు చెందిన సుబ్బారావు అనే వ్యక్తి వద్ద అతి తక్కువ ధరతో విత్తనాలు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ మేరకు అండర్ సెక్షన్ 34 ఐపీసీ, సెక్షన్ 19 ఆఫ్ సీడ్ యాక్ట్ సెక్షన్ 15(1) ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా నకిలీ విత్తనాలు తరలిస్తు పట్టుబడిన సొల్లు పెద్దయ్య అలియాస్ సురేష్ (36) ఐచర్ వ్యాన్ యజమానితో పాటు డ్రైవర్, సొల్లు హరికుమార్ (26) ఐచర్ వ్యాన్ క్లీనర్ అదుపులోకి తీసుకోవడంతో పాటు పట్టుబడిన ఐచర్ వ్యాన్, 5.5 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు, రూ.1,80,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నకిలీ విత్తనాల ఖరీదు సుమారుగా రూ.16 లక్షల 50 వేలు ఉంటుందని తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులతో పాటు స్వాధీనపర్చుకున్న వాటిని చెన్నూర్ పోలీస్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమ నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ అధికారులకు పోలీస్ కమీషనర్ రివార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ టౌన్ ఇన్స్‌పెక్టర్ రవిందర్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సంజయ్, చిన్ను, వ్యవసాయ అధికారి గ్లాడ్సన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

జూన్ 2వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీరాంపూర్ ఏరియాలో విజయవంతం చేయాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం వేడుకలకు సంబంధించి జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని దానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తిచేసి ఈ వేడుకలను దిగ్విజయం చేయవలసిందిగా వివిధ విభాగాల అధిపతులకు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని, అలాగే వేడుకలు చూడడానికి వచ్చిన ఆహుతులకు అన్ని సదుపాయాలను కల్పించడానికి కావాల్సిన ముందస్తు ప్రణాళికలు వేసుకుని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఉదయం 8 గంటలకు నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుండి షిర్కే సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి ఉదయం 9 గంటలకు జీఎం కార్యాలయం ముందు ఉన్న అమరవీరుల స్తూపం వద్ద, ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళ్లు అర్పించి, జాతీయ జెండాను ఎగురవేయడం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు వివిధ స్టాల్స్ ఓపెన్ చేసి సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగికి, ఉత్తమ సేవ సభ్యులకు, సింగరేణి పాఠశాల ఉత్తమ విద్యార్థులకు సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతి మైదానం కూడా జీఎం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

మందమర్రి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై అధికారులతో మంగళవారం జీఎం మనోహర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ జూన్ 2న సింగరేణి హై స్కూల్



గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందరినీ అలరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. ఆ రోజు ఉదయం 7:20 గంటలకు రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరించి, సూపర్ బజార్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుండి ర్యాలీగా రామాలయంలోని అమరవీరుల స్తూపానికి నివాళ్లు అర్పించిన అనంతరం మందమర్రి జీఎం కార్యాలయంలో ఉదయం 9: 00 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం తెలంగాణ రుచులు, తిను బండారాల స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వెంచర్ల ఏర్పాటుపై విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో వెంచర్ల ఏర్పాటుకు సంబంధించి విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ ధర్మారాణి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని పిర్యాదు అందినట్లు ఆమె తెలిపారు. విచారణ పూర్తయితే తప్పా నిజ నిర్ధారణకు రాలేమని అన్నారు. కాగా పిర్యాదుదారుడనైన నాకు కనీస సమాచారం ఇవ్వకుండా విచారణ చేపట్టడం బాధాకరమని పిర్యాదిదారుడు నయీం ఆవేధన వ్యక్తం చేశారు. మండల పరిధిలో విచ్చల విడిగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామ పంచాయతీల కనీస అనుమతులు కూడా తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. అక్రమ వెంచర్ల ఏర్పాటు పట్ల మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని జిల్లా అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్రమ వెంచర్ల పట్ల నోటీసులు ఇవ్వడం తప్పా తదుపరి చర్యలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా అధికారులక పలు దఫాలుగా పిర్యాదు చేయడం ద్వార విచారణ మొదలైందని తెలిపారు.

దళితులను చిన్న చూపు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల రాజమల్లు



నవతెలంగాణ-దండేపల్లి

దళితులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులను స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనకుండా రిజర్వేషన్ తొలగించారని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల రాజమల్లు అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 పంచాయతీ రాజ్ చట్టం ద్వారా ఏజెన్సీ గ్రామాలలో దళితులు పోటీ చేయకుండా రిజర్వేషన్ తొలగించి తమను అవమానపరిచారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో భూమిపై ఎలాంటి హక్కు లేక ప్రభుత్వ పథకాలు వర్తించక ఆర్థికంగా వెనుకబడి కూలినాలి పనిచేస్తూ వెనుకబడి ఉన్నారని ఆయన అన్నారు. పలు ఏజెన్సీ గ్రామాలలో గిరిజనులు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు. ఎస్టీలు లేని ఏజెన్సీ గ్రామాలలో ఎస్సీలకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనులు లేని ఏజెన్సీ గ్రామాలలో 1/70 ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రస్తుత పంచాయతీ ఎన్నికలలో దళితులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదివరకే ఏజెన్సీ గ్రామాలలో తొలగించిన ఎస్సీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడ దయాకర్, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి దయాకర్, మాల మహానాడు సంఘం మండల అధ్యక్షుడు కొండ నరేష్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు సాయిని రాజలింగు, నేతకాని సంఘం టేకుమట్ల చంద్రయ్య పాల్గొన్నారు.

భూ కబ్జా దారుల నుంచి పార్కు స్థలాన్ని కాపాడాలి

నవతెలంగాణ-మంచిర్యాల



మున్సిపాలిటీ పరిధిలో గల ఉమర్ మియ సొసైటీ లే అవుట్‌లో ఏర్పాటు చేసిన పార్క్ స్థలాన్ని కబ్జా దారుల నుంచి కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీకి ఇచ్చిన భూమిలో గతంలో కంచె వేసినప్పటికీ కొందరు దాన్ని తొలగించారని, హద్దులు చెరిపేసి పార్క్ స్థలాన్ని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాలని చూస్తున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. పార్క్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, పార్క్ స్థలం కబ్జా కాకుండా చూడాలని అధికారులను కోరారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, కౌన్సిలర్ సుంకరి శ్వేత రమేష్, తాజ్, కిరణ్ పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని దౌడేపల్లి గ్రామానికి చెందిన పోన్నం అంజన్న(29) అనే వ్యక్తి ఇంట్లో దులానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ పి చంద్రకుమార్ తెలిపారు. కూలి పనిచేసుకుంటున్న అంజన్న గత ఏడాది కాలంగా కడుపునొప్పి, సైనస్ వ్యాధితో తీవ్రంగా బాధపడుతుండు. కుటుంబసభ్యులు ఆస్పత్రుల్లో చూపించి మందులు వాడిన వ్యాది నయంకాకపోవడంతో ఆరోగ్యం క్షీణించి మనస్తాపం చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి పొన్నం చిన్నయ్య పిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసు నమోదు చేసునమోదు చేసినట్లు తెలిపారు.